ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కరీంనగర్

జిల్లా వార్తలు

5

బుధవారం 12 మార్చి 2025



రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6:27 బుధవారం

సహర్ 5:06 గురువారం

సౌండ్ పొల్యూషన్‌పై పోలీసుల స్పెషల్ డ్రైవ్

- 12 వాహనాల పట్టివేత



ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పట్టుబడిన వాహనాలు

కరీంనగర్ క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టణంలో పోలీసులు మంగళవారం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. పెద్ద పెద్ద శాబ్ధాలతో పోతున్న వాహనాలను పట్టుకున్నారు. ప్రస్తుతం వివిధ రకాల పరీక్షలు జరుగుతున్న సందర్భంలో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. విద్యార్థులకు సౌండ్ పొల్యూషన్ బారి నుంచి తప్పిం చేందుకు వాహన తనిఖీలు నిర్వహించారు. శబ్ధకాలుష్యానికి పాల్పడు తున్న 8 ద్విచక్రవాహనాలతో పాటు మైనర్‌లు డ్రైవింగ్ చేస్తున్న మరో 4 బైక్‌లను పోలీసులు పట్టుకున్నారు. ఈ వాహనాలను కరీంనగర్ ట్రాఫిక్ పోలీసు ఠాణాకు తరలించారు. పట్టుబడిన వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తూ, సౌండ్ పొల్యూషన్ వల్ల ప్రజలకు కలిగే ఇబ్బందుల గురించి వివరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు వివరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని ట్రాఫిక్ సీఐ కరీముల్లఖాన్ హెచ్చరించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ సీఐ పర్శ రమేష్, ఎస్ఐ ఉపేంద్ర చారి, ఆర్ఎస్ఐ గణేష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో కాయకల్ప చికిత్స

- బలం, బలహీనతలు, లోటుపాట్లపై విచారణ
- సీనియర్ నేతలతో ఏఐసీసీ ప్రతినిధుల భేటీ
- ఇన్‌చార్జి మార్పుతో కేడర్‌లో కొత్త ఆశలు
- పార్టీతో ఉన్నవారికి మంచిరోజులంటూ ప్రచారం



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్‌లో కాయకల్ప చికిత్స ప్రారంభమైందా అంటే ఔననే సమాధానం వస్తున్నది. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా మీనాక్షీ నటరాజన్ నియామకంతో పలు మార్పు లు చోటు చేసుకుంటున్నాయి. మొదటి నుంచి కాంగ్రెస్‌లోనే ఉంటూ వస్తున్నవారికి, ఏ అవకాశం దక్కని సీని యర్లకు, పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసే వారికి పెద్ద పీట వేసేందుకు రంగం సిద్ధమవుతున్నదంటూ పార్టీలో ప్రచారం జరుగుతున్నది. ఏఐసీసీ కార్యదర్శులు, ఆ స్థాయి నేతలు, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు, ముఖ్యకార్యకర్తలతో భేటీ అయి పార్టీ ఆయా నియోజకవర్గాల పరిధిలో, ఆయా జిల్లాల్లో ప్రస్తుతమున్న పరిస్థితిపై విచారిస్తున్నట్లు సమాచారం. కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలువురు నేతలు, కార్యకర్తలను మూడు రోజుల క్రితం గాంధీభవన్‌కు పిలిపించుకొని వేర్వేరు సమయాల్లో వారితో ఒక్కొక్కరితో భేటీ అయి పలు అంశాలను కూలంకషంగా చర్చించి వివరాలను నమోదు చేసుకున్నట్లు తెలిసింది. గాంధీభవన్‌కు పిలిపించిన వారి వ్యక్తిగత విషయాలను ప్రశ్నించి, ఎంత కాలం నుంచి పార్టీలో ఉన్నారు. గతంలో లభించిన అవకాశాలు, ఏయే సందర్భాల్లో టికెట్ ఆశించారు, అప్పుడు ఏమి జరిగింది, ప్రస్తుతం జిల్లాలో, నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి ఎలా ఉంది, ఎన్నికైన ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఎలా పనిచేస్తున్నారు. వారు కేడర్‌తో సమన్వయంతో ఉంటున్నారా..., నియోజకవర్గంలో పార్టీ బలమేంటీ, బలహీనతలు ఏమిటీ, సరిదిద్దుకోవలసిన లోటుపాట్లు ఏమున్నాయనే విషయాలపై లోతుగా ప్రశ్నించి, వివరాలు రాసుకున్నట్లు సమాచారం. జిల్లాకు చెందిన ఎనిమిది మందిని పార్టీ ఏఐసీసీ కార్యదర్శి పిలిపించుకొని ఈ విషయాలను విచారించారని తెలిసింది.

● జిల్లాలో పార్టీ పరిస్థితిపై ఆరా

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయిన మూడు రోజుల్లోనే ఈ భేటీలు జరిగినా నేరుగా ఆ అంశాన్ని ప్రస్తావించకుండా నేతల పరిస్థితి, పార్టీ పరిస్థితి, చేయాల్సిన మార్పులపై విచారించారని చెబుతున్నారు. విచారణలో పాల్గొని వచ్చిన నేతలు ఏ విషయాలను బయటికి చెప్పకుండా గుంభనంగా ఉంటున్నా కార్యకర్తలకు, పార్టీ వీడని వారికి ఇప్పటి వరకు అవకాశాలు దక్కకుండా అన్యాయం జరిగిన వారికి త్వరలోనే మంచిరోజులు రాబోతున్నాయంటూ పార్టీలో చర్చించుకుంటున్నారు. పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు కూడా

(మిగతా 8వ పేజీలో)

లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, అధికారులు

సుభాష్‌నగర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ పేర్కొన్నారు. స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా మంగళవారం జిల్లాలో స్కానింగ్ సెంటర్లు, ఫెర్టిలిటీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్‌కు వచ్చిన వారి వివరాల నమోదు, పనిచేస్తున్న డాక్టర్ల అర్హత, గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం-1994, రూల్స్-1996 అమలవుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భస్థ శిశువుగా ఉన్నపుడు లింగ నిర్ధారణ చేస్తే పరీక్షలు చేసిన వారికి, చేయించినవారికి, ప్రోత్రహించిన వారికి చట్టప్రకారం మూడు సంవత్సరాల జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానా విధించబడుతుందని అన్నారు. దీన్ని తెలిపే విధంగా బోర్డులు ప్రదర్శిస్తున్నారా లేదా, స్కానింగ్ సెంటర్లలో ఖచ్చితంగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ధరల పట్టిక, సరైన రికార్డుల నిర్వహణ ఉండాలని నిర్వాహకులకు సూచించారు. స్కానింగ్ సెంటర్లు, ఫెర్టిలిటీ కేంద్రాల తనిఖీ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఈ తనిఖీల్లో పీవో డీటీటీ డాక్టర్ ఉమాశ్రీ, పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సనాజవేరియా, సఖి కన్సల్టెంట్ డి లక్ష్మి, డాటా ఎంట్రీ ఆపరేటర్ కె రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

- జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ప్రతిమ

సుభాష్‌నగర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ప్రతిమ అన్నారు. మంగళవారం టీఎస్ జీవో, టీజీవో ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా జడ్జి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలందరూ తప్పని సరిగా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అబ్బా యిలతో సమానంగా అమ్మాయిలను పెంచి ఉన్నత చదు వులు చదివించాలని సూచించారు. చదువుతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తుందని, ఉన్నత చదువులు చదవాలని సూచించారు. మహిళలు ఏ రంగలో ఉన్నా బాధ్యతలు మరచిపోవద్దని, అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ప్రతిమ

మహిళా ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ పమేలాసత్పతి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్ పమేలాసత్పతి

ఇంటిపనులతో పాటు ఉద్యోగ బాధ్యతల్లోనూ కీలకపాత్ర పోషిస్తున్న మహిళా ఉద్యోగులు ఆరోగ్యం పై కూడా శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు, వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు కుటుంబ పనులతో పాటు ఉద్యోగ బాధ్య తలతో తీరికలేకుండా ఉంటారని అన్నారు. వారంతా ఖచ్చితంగా ప్రతి ఆరునెలలకు ఒకసారి వైద్యపరీక్షలు చేయించు కోవాలన్నారు. జిల్లా యంత్రాంగం అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ప్రాథమిక ఆరోగ్యకేం ద్రాల్లో ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళ ఉద్యోగులు కూడా ఈ పరీక్షలు ఉచితంగా చేయించుకోవచ్చన్నారు. సుమారు 50వేల ఖరీదు చేసే 45 రకాల వైద్యపరీక్షలు ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. ప్రత్యేకంగా ఉద్యోగుల కోసం ఈ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గర్భిణీలు పౌష్టికాహారం తీసుకో వాలని సూచించారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి, జిల్లా జడ్జి ప్రతిమ చేతులమీదుగా బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్ర మంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, జిల్లా సంక్షేమ అధికారి సబిత, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మన్‌రావు, టీజీవో జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్, కార్యదర్శి అరవింద్‌రెడ్డి, కేంద్ర సంఘం నాయకులు నాగుల నర్సింహస్వామి, గూడ ప్రభాకర్‌రెడ్డి, సర్దార్ హర్మిందర్‌సింగ్, హరికృష్ణ, జిల్లా సహా. ధ్యక్షుడు ఒంటెల రవీందర్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్, కార్యదర్శి వెలిచాల సుమంత్ రావు, పోలు కిషన్, నాగరాజు, కోడూరి వాస్తవిక్, కొంమేర శ్రీనివాస్‌రెడ్డి, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్, మహిళ ఉద్యోగుల జేఏసీ చైర్‌పర్సన్ శారద, సబిత, సునీత, విజయలక్ష్మి, లత, హరిప్రియ, సుస్మిత, శైలజ, సరిత, రాధిక, టీజీవో సంఘం నాయకులు వీణా, రాజేశ్వరి, మమత, కిషన్‌రెడ్డి, కరుణాకర్, మల్క రాజేశ్వరరావు, జలాలుద్దీన్‌అక్బర్, అజ్గర్, కామ సతీస్, శ్రీనివాస్‌రావు, అరసవెల్లి రాజేశ్వర్‌రావు, రోహిత్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



బెలూన్ ఆటలో పాల్గొన్న టీఎన్‌జీవో నాయకులు

ఏసీపీ కార్యాలయం తనిఖీ



కరీంనగర్ టౌన్ ఏసీపీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కరీంనగర్ టౌన్ డివిజన్ ఏసీపీ కార్యాలయాన్ని మంగళవారం పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సందర్శిం చారు. కార్యాలయంలోని పెండింగ్ కేసులపై సమీక్ష చేశారు. పెండింగ్‌కు కారణాలు తెలు సుకున్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అర్బన్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబంధించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్నందున, వాటి బారిన పడకుండా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. పెండింగ్ వారెంట్ల అమలు చేయాలన్నారు. రోడ్డు ప్రమా దాలపై చర్చించారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ హోల్స్‌గా గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి రవాణా, అక్రమ ఇసుక రవాణా, పీడీఎస్ బియ్యం, పేకాట స్థావరాలను గుర్తించి ఆడేవారిని పట్టుకోవడం, వాటిని గుర్తించి తగిన కేసులు నమోదు చేసి, వాటిపై ఉక్కుపాదం మోపా లన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, సీఐలు బిల్లా కోటేశ్వర్, జాన్‌రెడ్డి, మహిళా పోలీసు ఠాణా సీఐ పి శ్రీలతతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్చిలోనే మానేరు కటకట..



పంటల సాగుకు నీటిని వదలడంతో పాటు, మార్చిలోనే ఎండలు మండుతుండటంతో మానేరులో నీరు తగ్గుతోంది. కరీంనగర్ పట్టణానికి తాగునీటిని అందించే మానేరు డ్యాంలో నీటి మట్టం తగ్గుతుండటంతో వేసవిలో తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఎస్సారెస్పీతో పాటు ఎగువమానేరు నుంచి నీరు విడుదల చేయాల్సిన అవసరం ఏర్పడుతోంది.

- ఆంధ్రజ్యోతి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, కరీంనగర్

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద
- తిమ్మాపూర్ జ్యోతిబాపూలే పాఠశాల హాస్టల్ తనిఖీ

తిమ్మాపూర్, మార్చి 11, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతి బాపూలే బాలికల పాఠశాల, కళాశాలతో పాటు వ్యవసాయ కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంటగది పరిశుభ్రంగా లేకపోవడంతో కొన్ని చోట్ల ఫుడ్ పాయిజన్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ప్రభుత్వం నుంచి నాణ్యమైన వస్తువులు వస్తుండగా, కొన్ని బయటనుంచి కొనుగోలు చేస్తుండటంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ సందర్భంగా జ్యోతిబాపూలే పాఠశాల, హాస్టల్‌ను, స్టోర్ రూం, టాయిలెట్స్‌లను ఆమె పరిశీలించారు. పిల్లలతో పాటు ప్రిన్సిపాల్, సిబ్బందితో వేరువేరుగా సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలతో కలిసి భోజనం చేశారు. స్కూల్, ఇంటర్, పక్కనే అగ్రికల్చర్ కళాశాల విద్యార్థినిలు కలిపి సుమారు 12వందల మంది ఉండటంతో భోజనం చేసే సమయంలో ఇబ్బంది ఎదురవుతోందన్నారు. దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



తిమ్మాపూర్‌లోని మహాత్మాజ్యోతి బాపూలే హాస్టల్‌లో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద



హాస్టల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న నేరెళ్ల శారద

● గోడు వెళ్లబోసుకున్న విద్యార్థులు

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రతిరోజూ మూడు మూడు పూటలా భోజనం పెడుతున్నారని ఉదయం టిఫిన్ పెట్టడం లేదని విద్యార్థులు గోడు వెళ్లబోసుకున్నారు. తాగునీటికి ఇబ్బంది లేదని వాడుకోవడానికి నీటి కొరత ఉందని చెప్పారు. ప్రభుత్వం ఇస్తున్న కాస్మోటిక్ చార్జీలను తమకు ఇవ్వడం లేదని కొందరు విద్యార్థులు తెలిపారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ మెనూ ప్రకారం విద్యార్థినిలకు భోజనం ఎందుకు పెట్టడం లేదని ప్రిన్సిపాల్ సరితపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించగా స్టాక్‌లో వస్తువులు ఎక్కువగా కనిపించాయి. పప్పు 51 కిలోలు ఎక్కువగా స్టాక్ కనిపించడంతో విద్యార్థులకు సరిపడా ఎందుకు ఇవ్వడం లేదంటూ మండిపడ్డారు. దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ పాఠశాలపై ఇప్పటికే పలు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. వాటిపై కూడా విచారణ చేపడతామన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, **MOHAMMED SHABUDDIN,** H.No. 7-2-225, MANKAMMATHOTA KARIMNAGAR, HAVE CHANGED MY NAME AS **MOHD SHAHABUDDIN**

AJK-16588

CHANGE OF NAME

★ I, **SAFIYA BEGUM,** H.No. 7-2-225, MANKAMMATHOTA, KARIMNAGAR HAVE CHANGED MY NAME AS **SAFIA BEGUM**

AJK-16588

పాస్‌పోర్ట్ పోయినది

KANDUKURI VENKATESH S/o. KANDUKURI RAMANNA, R/o. H.No. 3-23, కెనాల్ స్ట్రీట్, ఇబ్రాహీంపల్లి, మండలం: గొల్లపెల్లి, జిలా: జగిత్యాల (T.G), PIN: 505532, గారికి సంబంధించిన నెంబర్ B2972379 గల పాస్‌పోర్ట్ ఇల్లు మారుతుండగా ఎక్కడోపడిపోయినది. కావున ఎవరికైనా దొరికినచో ఇవ్వగలరు. సెల్: 91008 42864

AJK-232467

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 9703618691, 9985410640

జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 9985411262

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 9985411063

పెద్దపల్లి :- 95509 00238

National Working Mom s Day Greetings

మార్చబడినది

దాదాజి

హోమియోపతి & ఆయుర్వేదిక్ కేర్ సెంటర్ (Since: 1943)

DADAJI Homeopathy & Ayurvedic Care Centre



డా॥ యస్. నరేష్‌కుమార్, BHMS Reg. No. 7221/H/2011

డా॥ యస్. ప్రసాద్, BAMS Reg. No. 197/A/15

క్షారసూత్ర చికిత్స మా ప్రత్యేకత

KSHARASUTRA (Piles, Fissures, Fistula Piloidal Sinus)

మా వద్ద: పైల్స్, ఫిస్టులా(భగంధ్రం) పైలోనియడల్ సైనస్, మలబద్ధకం IBD, IBS పాలిప్స్, గ్యాస్ట్రిక్ సమస్య, మలద్వారా పులిపిర్లు థైరాయిడ్.

మాకు జగిత్యాలలో బ్రాంచి కలదు. వేరే ఏ చోట మా బ్రాంచి లేదు.

www.dadajiclinic.com

అడ్రస్: ప్రశాంత్‌నగర్, మాతాశిశు ఆసుపత్రి ఎదురు లైన్, శ్రీసాయి పిల్లల హాస్పిటల్ దగ్గర, కరీంనగర్.

సెల్: 93920 02829

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

కరీంనగర్ జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. సైదాపూర్ మండలం వెంకటేశ్వర్లపల్లిలో యువకుడు, సైదాపూర్ మండలంలోని ఆకునూర్ భూషణగట్ల వద్ద ఓ వ్యక్తి, మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన మరో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు.

మనస్తాపంతో యువకుడు..


కరుణాకర్ (ఫైల్)

సైదాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన బొడిగ కరుణాకర్ (38) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన బొడిగ కరుణాకర్ ఈ నెల 9న ఆకునూర్ గ్రామానికి వెళ్లాడు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, ఒక మహిళతో పాటు పలువురు విచక్షణారహితంగా దాడి చేశారు. మనస్తాపానికి గురైన కరుణాకర్ పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి రాంబాబు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సైదాపూర్ ఎస్‌ఐ తిరుపతి తెలిపారు.

అనారోగ్య సమస్యలతో ఒకరు..


నర్సింహాచారి (ఫైల్)

సైదాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఆకునూర్ భూషణగట్ల వద్ద బండోజు నర్సింహాచారి (53) అనే వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామానికి చెందిన బండోజు నర్సింహాచారికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నర్సింహాచారికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఖరీదైన వైద్యం చేయించుకోలేక జనవరి 8న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకు ఇంటికి రాకపోయే సరికి కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కాగా సోమవారం ఆకునూర్ గ్రామశివారులోని భూషణగట్ల వద్ద ఉరేసుకొని ఉన్న మృతదేహం కనిపించడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ తిరుపతి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి అల్లుడు ఓంప్రకాష్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు.

మానసికస్థితి సరిగా లేక ఓ వ్యక్తి..

మానకొండూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన పోలం అంజయ్య (53) అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అంజయ్యకు కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేకపోవడంతో కరీంనగర్‌లోని పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినట్లు తెలిపారు. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి పడుకున్న అంజయ్య తెల్లవారే సరికి ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకొని మృతి చెందిన తీరును పరిశీలించారు. మృతుని కుమారుడు రఘు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మల్యాల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లిన ఓ ఇంట్లో దొంగలు తాళాలు పగులగొట్టి బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లిన సంఘటన మల్యాలలో చోటు చేసుకుంది. మల్యాల మండల కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన అస్మ సుల్తానా కుటుంబసభ్యులు ఈ నెల 6వ తేదీన జగిత్యాలలోని బంధువుల ఇంటికి వెళ్లారు. కాగ మంగళవారం ఇంటికి రాగ తాళం పగులగొట్టి ఉండి ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురై కనిపించాయి. బీరువాలోని రూ.25వేల నగదుతో పాటు అయిదు తులాల బంగారు నగలను దొంగలు ఎత్తుకెళ్లడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై నరేశ్‌కుమార్ సంఘటన స్థలం పరిశీలించి దర్యాప్తు జరుపుతున్నారు.

జ్వరంతో పదో తరగతి విద్యార్థిని మృతి


రమ్య(ఫైల్)

హుజూరాబాద్ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన బండారి రమ్య(14) అనే పదో తరగతి విద్యార్థిని తీవ్రజ్వరంతో మంగళవారం మృతి చెందింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బండారి పెద్ద రమేష్-సంపూర్ణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రమేష్ జమ్మికుంటలో వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చిన్నకుమార్తె బండారి రమ్య గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. 20 రోజుల నుంచి జ్వరంతో బాధపడుతుండగా చికిత్సకోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లిన తగ్గలేదు.

సోమవారం రాత్రి తీవ్రజ్వరం రావడంతో చికిత్సకోసం ఉదయం ఆసుపత్రికి తీసుకెళ్దామని అనుకునే లోపు మంగళవారం మృత్యువాత పడింది. నిరుపేద కుటుంబం కావడం మూలంగా సరైన చికిత్స అందక బాలిక మృతి చెందటంపై గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'బోరు'మంటున్నారు..

● అడుగంటిన జలాలు.. కాలిపోతున్న మోటార్లు.. ● పంటలను కాపాడుకునేందుకు రైతుల అవస్థలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు అడుగంటిపోయాయి.. వ్యవసాయ బోరు మోటార్లపై లోడ్ ఎక్కువై కాలిపోతున్నాయి. దీంతో సాగునీరు అందక ఎండుతున్న పంటలను చూసి రైతులు 'బోరు'మంటున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులు పంటలను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. పొట్ట దశకు వచ్చిన పంటకు సాగు నీరు అందిస్తే దిగుబడి వస్తుందనే ఆశతో రేయింబవళ్లు శ్రమిస్తున్నారు.


వ్యవసాయ బోరు మోటారును పైకి తీస్తున్న కూలీలు

కాలుతున్న బోరు మోటార్లు..

మండలంలోని గుండారం, రాజన్నపేట, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, అల్మాస్‌పూర్, దేవునిగుట్టతండా, వెంకటాపూర్, రాచర్ల తిమ్మాపూర్, బాకురుపల్లి తండా తదితర గ్రామాల్లోని రైతులు వరి పంటలను సాగుచేశారు. నాటు పూర్తయిందని అనుకున్న రైతుల గుండెల్లో అడుగంటిన జలాలు ఆందోళన కలిగించాయి. ధారలా వస్తున్న నీరుతో తడులు పారక పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. 24 గంటల పాటు వ్యవసాయ బోరు మోటార్లు నడిచేలా ఆటో స్టార్టర్లను బిగించారు. దాంతో నీరు అందక.. నాణ్యమైన విద్యుత్ సరఫరా కాక మోటార్లు కాలిపోతున్నాయి. చేసేదేమీ లేక వేల రూపాయలు వెచ్చిస్తున్నారు. ఒక్కో రైతు సుమారు రూ.8 నుంచి రూ.10 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. మండలంలో ఇప్పటికే సుమారు 120 మందికి చెందిన వ్యవసాయ బోరు మోటార్లు కాలిపోయాయని బాధిత రైతులు పేర్కొన్నారు. ఒక్కో రైతు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు వెచ్చిస్తున్నారని వాపోతున్నారు. కాలిపోయిన బోరు మోటార్ల మరమ్మతుల కోసం సుమారు రూ.9.60 లక్షలు ఖర్చు చేశారని చెబుతున్నారు. అప్పులు చేసి పంటను దక్కించుకునేందుకు అవస్థలు పడినా పెట్టుబడులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

కెపాసిటర్లు బిగించుకోవాలి..

పృథ్వీధర్, సెస్ ఏఈ



మండలంలోని రైతులు వ్యవసాయ బోరు మోటార్లకు ఆటో స్టార్టర్లను బిగించడం వల్ల కరెంటు ఉన్నంత సేపు మోటార్లు నడుస్తున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నీరు అందక మోటార్లు కాలిపోతున్నాయి. బోరు మోటార్లు కాలిపోకుండా కెపాసిటర్లను బిగించుకోవాలి.


బోరు మోటార్లకు మరమ్మతు చేస్తున్న మెకానిక్‌లు

కూలీలు, మరమ్మతులకు రూ.9 వేలు వెచ్చించా..

గూడెపు నర్సయ్య, రైతు, గుండారం



నాకున్న భూమిలో రెండు వ్యవసాయ బోరు బావులున్నాయి. వాటిపై ఆధారపడి రెండెకరాల్లో వరి పంటను సాగు చేశా. ఓ బోరు ఎత్తేసింది. ఉన్న ఒక్క బోరు బావి అందిస్తున్న నీటితో తడులు పెడుతున్నా. పంట పొట్ట దశకు వచ్చింది. బోరు మోటారు కాలిపోయింది. మోటారు తీసేందుకు రూ.4 వేలు చెల్లించి బయటకు తీయించా. గొల్లపల్లిలోని రిపేరు షాపునకు తీసుకువచ్చాను. మరమ్మతుకు మరో రూ.5 వేలు అయ్యాయి. కూలీలు, మరమ్మతులకు మొత్తం రూ.9 వేలు ఖర్చు చేశా. పంట చేతికందినా పెట్టుబడులు, ఖర్చులు కూడా వచ్చేట్టు లేవు.

హత్య కేసులో పురోగతి

కరీంనగర్ క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని లక్ష్మీనగర్‌కు చెందిన క్రస్రీపాయింట్ నిర్వాహకుడు బాలసాని రాము హత్య కేసులో పోలీసులు కొంత పురోగతిని సాధించారు. ఇప్పటికే రాము బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు ఈ కేసుతో సంబంధం ఉన్నట్లుగా అనుమానిస్తున్న కరీంనగర్‌కు చెందిన ఇద్దరిని సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారు ఇచ్చిన సమాచారంతో ప్రధాన నిందితుడైన సంతోష్‌ను పట్టుకునేందుకు స్పెషల్ పోలీసుటీంలు రంగంలోకి దిగినట్లు సమాచారం. సంతోష్ పట్టుబడితే అసలు విషయం వెల్లడయ్యే అవకాశాలున్నాయి. బాలసాని రాము మృతదేహానికి మంగళవారం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తిచేసి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

● న్యాయం చేయాలి

తన భర్త రామును డబ్బుల కోసం హత్య చేశారని మృతుడి భార్య లతశ్రీ ఆరోపించింది. తమకు న్యాయం చేయాలని కోరింది. రాముకు సంతపురి సంతోష్ దగ్గరి స్నేహితుడని, శనివారం పదేపదే ఫోన్ చేయడంతో రూ.25 వేల వరకు నగదు, ఏటీఎం కార్డును తీసుకొని సంతోష్ గదికి వెళ్లాడని తెలిపింది. డబ్బుల కోసమే రామును హత్య చేశారని అతడి సోదరుడు ఆరోపించాడు.

ప్రమాదవశాత్తు
17వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ మృతి


నివాళులర్పిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఇన్‌సెట్‌లో గంగారాం(ఫైల్)

సిరిసిల్ల క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం లోని వెంకట్రావునగర్‌లోని ఓ మూడంతస్తుల భవనంపై నుంచి ప్రమాదవశాత్తు లిఫ్ట్ గోతిలో పడి సర్దాపూర్ 17వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ తోట గంగారాం (59) మృతి చెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి 10.30గంటలకు తన స్నేహితుడైన సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి కూతురు మృతిచెందగాగా అద్దెకు ఉంటున్న అపార్ట్‌మెంట్‌కు అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావుతో కలిసి అడిషనల్ కమాండెంట్ గంగారాం వెళ్లారు. తిరిగి వెళుతున్న క్రమంలో బటన్ నొక్కగా సేఫ్టీ గేట్ తెరుచుకుంది. లిఫ్ట్ వచ్చిందనుకొని ముందుకు అడుగువేయగా ప్రమాదవశాత్తు ఒక్కసారిగా గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న లిఫ్ట్‌పై పడి చాతి, ఎడమకాలు, ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. అక్కడే ఉన్న మిగతా పోలీస్ అధికారులు అగ్నిమాపక సిబ్బంది సహకారంతో గంగారాంను బయటకు తీసి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందారు. తెలంగాణ సచివాలయంలో సీఎస్‌వోగా పనిచేసిన 1989బ్యాచ్‌కు చెందిన గంగారాం సిరిసిల్ల పట్టణంలోని సర్దాపూర్ 17వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్‌గా మూడునెలల క్రితమే విధుల్లో చేరారు. మరో రెండేళ్లలో రిటైర్ కావాల్సి ఉంది. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలోని సిద్దులం గ్రామానికి చెందిన గంగారాం హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. గంగారాంనకు భార్య రేఖ, కొడుకు సతీష్‌కుమార్, ఇద్దరు కూతుళ్లు గౌతమి, మీనల్‌లు ఉన్నారు. ఈ సంఘటన తెలుసుకున్న కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులు సిరిసిల్లకు తరలివచ్చి విలపించడంతో జిల్లా ఆసుపత్రి వద్ద విషాదం అలుముకుంది. సంఘటనపై మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

● శ్రద్ధాంజలి ఘటించిన కలెక్టర్..

అడిషనల్ కమాండెంట్ గంగారాం పార్థివదేహానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయనతో పాటు అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, 1వ, 3వ బెటాలియన్ కమాండెంట్‌లు మురళీకృష్ణ, జమీల్‌పాష, 17వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు, రాందాస్, అధికారులు, సిబ్బంది పుష్పాంజలి ఘటించారు.

కాలువలో పడి వ్యక్తి మృతి


వెంకటేష్ (ఫైల్)

కోల్‌సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని శ్రీనగర్‌కాలనీ నుంచి మున్సిపల్ హెడ్ వర్క్స్ రహదారిలో మల్కాపూర్ శివారు నాలాలో పడి మానాల వెంకటేష్ (47) అనే వ్యక్తి మృతి చెందాడు. మంగళ వారం ఉదయం పనికి వెళ్లేందుకు స్కూటీ పై వెళుతుండగా ప్రమాదవశాత్తు అందు లో పడ్డాడు. గతంలో గోదావరి వరదలకు కాలువ వద్ద కూలిపోయింది. దీంతో ప్రమా దవశాత్తు వెంకటేష్ అందులో పడిపోయా డు. భార్య స్వప్న, కూతుర్లు రష్మిక, హారిక ఉన్నారు. వెంకటేష్ భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కే రమేష్ పేర్కొన్నారు.

బైక్ ఢీకొని సైక్లిస్టు మృతి

సిరిసిల్ల క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన నాయిని రాజయ్య(59) మానేరు బ్రిడ్జి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం... రాజయ్య తన సైకిల్‌పై వెల్జిపూర్ గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో మానేరు బ్రిడ్జి వద్ద వెనుకవైపు నుంచి అతివేగంగా వచ్చిన బుల్లెట్ వాహనం ఢీకొంది. తీవ్రగాయాలతో ఉన్న రాజయ్యను చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై రమేశ్ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారకుడైన కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన శీతల్లి మనోహర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

గంజాయి చాక్లెట్లు పట్టివేత

కరీంనగర్ క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ హౌజింగ్ బోర్డు కాలనీలో కరీంనగర్ మూడో ఠాణా పోలీసులు మంగళవారం నిర్వహించిన తనిఖీలలో కిలోన్నర గంజాయి చాక్లెట్‌లు పట్టుబడ్డాయి. మూడో ఠాణా పోలీసుల వివరాల ప్రకారం... హౌజింగ్ బోర్డు కాలనీలోని ఓపెన్ జిమ్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద ఆరు ప్యాకెట్లలో 1 కిలో 460 గ్రాముల గంజాయి చాక్లెట్‌లు పట్టుబడ్డాయి. గంజాయి చాక్లెట్లతో పట్టుబడినవారిలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బస్తీ జిల్లా నౌవా గ్రామానికి చెందిన మహేష్‌కుమార్ గౌతం(40) అనే వ్యక్తి ప్రస్తుతం కాపువాడలో నివాసం ఉంటున్నాడు. మరొకరు మహారాజ్ గంజ్ జిల్లా కరూపర్ గ్రామానికి చెందిన బబుల్(24) ప్రస్తుతం కరీంనగర్ అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. వీరిద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి నిషేధిత గంజాయి చాక్లెట్‌లతోపాటు రెండు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు. హౌజింగ్ బోర్డు కాలనీ ఓపెన్ జిమ్ వద్ద కొందరికి గంజాయి చాక్లెట్లు విక్రయించేందుకు సిద్ధమవుతుండగా పట్టుకున్నామని పోలీసులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామ మానేర్ పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీస్‌లు మంగళవారం పట్టుకున్నారు. గ్రామానికి చెందిన ఎమ్ ప్రశాంత్, కె ప్రశాంత్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ప్రియురాలు పట్టించుకోవడం లేదని..

- టవర్ ఎక్కిన ట్రాక్టర్ డ్రైవర్
- పోలీసుల చొరవతో సుఖాంతం


ఎన్టీపీసీలో టవర్ ఎక్కిన అజయ్

జ్యోతినగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రియురాలు తనను పట్టించుకోవడం లేదనే కారణంతో అజయ్ అనే ట్రాక్టర్ డ్రైవర్ మంగళవారం ఎన్టీపీసీ మేడిపెల్లి సెంటరులోని హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కాడు. మూడు గంటలపాటు అందరిని హైరానాకు గురి చేశాడు. చివరికి ఎన్టీపీసీ పోలీసులు చొరవ తీసుకొని ప్రియురాలిని రప్పించి అజయ్‌కు నచ్చజెప్పడంతో టవర్ దిగాడు. స్థానిక వీకే రామయ్య కాలనీకి చెందిన అజయ్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అజయ్ రామగుండంకు చెందిన కూలీ పనులు చేసుకునే ఒక మహిళతో సఖ్యత ఏర్పడింది. అయితే నిత్యం మద్యం తాగి వచ్చి మహిళను వేధిస్తున్నాడు. దీంతో ఆ మహిళ అతన్ని పట్టించుకోవడం మానేసింది. తనతో మాట్లాడడం లేదని, పట్టించుకోవడం లేదనే మనస్తాపంతో మంగళవారం అజయ్ టవర్ ఎక్కాడు. ఎన్టీపీసీ ఎస్‌ఐ ఉదయ్ ఎంత ప్రయత్నించినా కిందకు దిగలేదు. చివరికి సదరు మహిళను పిలిపించి సముదాయించడంతో టవర్ దిగాడు. అజయ్‌ను ఎన్టీపీసీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


గంగాధర్ (ఫైల్)

చందుర్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతిచెందాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. చందుర్తి మండలం మల్యాల గ్రామం చెందిన పోతరాజు గంగాధర్ (45) అనే వ్యక్తి ఈనెల 8న చందుర్తి నుంచి మల్యాలకు బైక్‌పై వెళుతున్నాడు. సనుగుల గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తి మల్యాల నుంచి చందుర్తికి బైక్ వెళ్తుండగా వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారిలోని ఎల్లంపల్లి కాల్వ సమీపంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో గంగాధర్‌కు తీవ్రగాయాలు కాగా హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు గంగాధర్ బావ బుర్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

పరిశ్రమల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి


మాట్లాడుతున్న డీవైసీఎఫ్ వై గంగాధర్‌రెడ్డి

జ్యోతినగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల యాజమాన్యాలు భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్(కరీంనగర్) వై గంగాధర్‌రెడ్డి అన్నారు. ఎన్టీపీసీలో నిర్వహిస్తున్న జాతీయ భద్రతా వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఏడీఎం బిల్డింగ్ ఆవరణలో జరిగిన ముగింపు కార్యక్రమానికి గంగాధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భద్రతా వ్యవస్థ బాగుంటేనే పరిశ్రమ అభివృద్ధి చెందుతుందన్నారు. భద్రత విషయంలో ఉద్యోగులను చైతన్యవంతుల్ని చేసే బాధ్యత యాజమాన్యాలపైనే ఉందని తెలిపారు. ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత మాట్లాడుతూ భద్రతతో కూడిన విద్యుత్ ఉత్పత్తికి కృషి చేస్తున్నామన్నారు. భద్రతా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ ముకేష్ కుమార్, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.


విజేతకు బహుమతి అందజేస్తున్న ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్

మొన్న కొండాపూర్.. నేడు సూరంపేటలో..

- పెద్దపులి కదలికలతో ఆందోళనలో ప్రజలు
- అప్రమత్తం చేసిన అటవీ అధికారులు


ప్రజలతో మాట్లాడుతున్న అటవీ అధికారులు

కొడిమ్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో మొన్న కొండాపూర్ గ్రామ శివారులో నేడు సూరంపేట అడవిలో పెద్దపులి కదలికలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని సూరంపేట, గంగారాంతండా అడవిలో మంగళవారం పెద్దపులి సంచరిస్తున్నట్లు గ్రామస్థులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. అడవిని ఆనుకొని ఉన్న నర్సరీలో మొక్కలకు నీటిని పోయటానికి బూక్య దీప్తి, బూక్య గోరీ అనే ఇద్దరు ఉపాధిహామీ కూలీలు వెళ్లారు. పెద్దపులిని గోరీ అనే మహిళ పరిగెత్తగా కింద పడి స్వల్పంగా గాయాలైనట్లు అటవీ అధికారులు తెలిపారు. గ్రామస్థులు పెద్దపులి కదలికలపై అటవీ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కొడిమ్యాల రేంజర్ గులాం మొయినుద్దీన్, డీఆర్వో ముషీర్‌అహ్మద్, పలువురు బీట్ అధికారులు పెద్దపులి కనిపించిన అటవీ స్థలానికి వెళ్లారు. సూరంపేట, గంగారాంతండా ప్రజలకు కనిపించింది ఏమిటని, ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. కొందరు పెద్దపులి అనగా, మరికొందరు చిరుతపులి అని సమాధానమిచ్చారు. అటవీ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేంజర్, డీఆర్వో, సిబ్బంది అవగాహన కల్పించారు. గత జనవరి 24న మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో ఆవుపై పెద్దపులి దాడి చేసి చంపింది. నాలుగురోజుల క్రితం మండలంలోని దమ్మయ్య పేట-రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలంలోని ఫాజుల్‌నగర్ గ్రామ శివారులో గేదెపై పెద్దపులి దాడి చేసిందన్న వదంతులు వినిపించాయి. కొడిమ్యాల మండలంలోని సూరంపేట గంగారాం తండా అడవిలో పెద్దపులి సంచారం సమాచారంతో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. పులి అడుగుల జాడ కోసం అటవీ అధికారులు సిబ్బంది గాలిస్తున్నారు. కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్, డీఆర్వో ముషీర్‌అహ్మద్, కొడిమ్యాల, మల్యాల మండలాల ప్రజలను అప్రమత్తం చేశారు.

ఈ విషయమై కొడిమ్యాల రేంజర్ గులాం మొయినుద్దీన్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పెద్దపులి కదలికలు ఉన్నట్లు తాము తెలుసుకున్నామన్నారు. పెద్దపులి సంచరించిన ఆనవాళ్లు, ఆధారాలు పూర్తిగా లభిస్తే పూర్తి నిర్ధారణ చేస్తామన్నారు. పెద్దపులి కొడిమ్యాల మండలంలోని సూరంపేట, గంగారాంతండా అడవిలో సంచరిస్తున్నట్లు భావిస్తున్నామని తెలిపారు. ప్రజలు, రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

శతాధిక వృద్ధురాలి మృతి


నర్సవ్వ (ఫైల్)

చందుర్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం లింగంపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు బండారి నర్సవ్వ (102) వయోభారంతో మంగళవారం మృతి చెందింది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. నర్సవ్వకు ఆరుగురు సంతానం. ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో ఒక కుమార్తె మృతి చెందింది.

రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కల్వల రోడ్డులో పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకొని పోలీస్‌స్టేషన్ తరలించారు. ఆటోలో 10 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సూల్తానాబాద్ మండలం గట్టెపల్లికి చెందిన ఆటో యజమాని మానుపటి జయశంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

యోగాలో రాణిస్తున్న ఆమని


అంతర్జాతీయ స్థాయిలో సాధించిన బంగారు పతకంతో ఆమని



జాతీయ స్థాయిలో ఐదవ స్థానం సాధించినందుకు..



తెలంగాణ జిల్లాల స్థాయి యోగా పోటీలలో గోల్డ్ మెడల్ అందుకుంటూ..

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో బంగారు పతకాలు

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి

సుల్తానాబాద్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణం మార్కండేయ కాలనీకి చెందిన జాపతి ఆమని యోగా పోటీలలో రాణిస్తోంది. యోగాలో రెండేళ్ల పాటు శిక్షణ పొందిన ఆమె జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొంటూ పతకాలు సాధిస్తోంది. నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి యోగా పోటీలలో బంగారు పతకం సాధించి రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప జేసింది. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీలలో పాల్గొం టూ ఇప్పటివరకు ఐదు బంగారు పతకాలు సాధించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి 16 వరకు కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీలలో రాష్ట్రం తరపున పాల్గొంది. ఈ పోటీలలో ఐదవ స్థానాన్ని సాధించి కేరళ ముఖ్య మంత్రి చేతుల మీదుగా పతకాలను అందు కున్నారు. ఈ పోటీలలో దేశం నుంచి ఆరుగురిని మాత్రమే ఎంపిక చేయగా తనకు ఐదవ స్థానం దక్కిందని ఆమని తెలిపారు.



అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం

గతేడాది నేపాల్‌లో జరిగిన ఓపెన్ ఇంటర్నేషనల్‌లో ఆమని పాల్గొని బంగారు పతకం సాధించింది. 2023లో గోవాలో కేంద్ర ప్రభుత్వం ఆయుష్ శాఖ తరపున నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలలో బంగారు పతకం సాధించింది. పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లో యోగా ప్రచార సమితి ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో గోల్డ్ మెడల్ వచ్చింది. కలకత్తాలో తెలంగాణ యోగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో ఫెడ రేషన్ కప్ సాధించింది. కలకత్తాలో జరిగిన ఫెడరేషన్ పోటీలలో రెండుసార్లు అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఆమని ఎంపికైంది. పంజాబ్‌లో ఖేల్ యువరత్న పురస్కార్ అవార్డు అందుకొంది. కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో గోల్డ్ మెడల్ సాధించింది.



బంగారు పతకమే లక్ష్యం

జాపతి ఆమని, అంతర్జాతీయ యోగా క్రీడాకారిణి

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన యోగా పోటీలలో పాల్గొని ప్రతిభను నిరూపించుకున్న. ప్రస్తుతం ఆసియన్ గేమ్స్, ఒలింపిక్స్ లక్ష్యంగా ఎదురుచూస్తున్నా. ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించి దేశ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింప జేయాలని ఉంది. అందుకు కఠోర శిక్షణ పొందుతున్నా. రెఫరీ కోసం రాసిన పరీక్షల్లో సెలక్ట్ అయినా దానిని కాదనుకుని ఒలంపిక్స్‌లో పాల్గొనడమే లక్ష్యంగా ఉన్నా.

యోగాలో పతకాల పంట పండించాలి

చెలుకు వాసుదేవరెడ్డి, యోగా నిపుణులు

యోగా పోటీలలో పతకాల పంట పండించాలి. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న యోగా క్రీడాకారులు క్రీడా ప్రతిభను చాటుకోవడం, పతకాలు సాధించడం అభినందనీయం. ప్రభుత్వం యోగాను ఒక క్రీడగా గుర్తించింది. ఎందరో యోగా క్రీడాకారులు స్పోర్ట్స్ సర్టిఫి కెట్లతో ఉన్నత స్థాయిలో ఉన్నారు. యోగాతో మానసిక ప్రశాంతత చేకూరి దినచర్య ఆటంకాలు లేకుండా సాగుతుంది.

మళ్లీ ఎమ్మెల్సీ అవకాశం రాకపోవడంపై అసంతృప్తి లేదు

- సామాజిక సమీకరణాల నేపథ్యంలో పదవి దక్కలేదు
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవి రాకపోవడంపై తనకు ఎలాంటి అసంతృప్తి లేదని, సామాజిక సమీకరణల నేపథ్యంలో రాలేదని భావిస్తున్నానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పదవులతో సంబంధం లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన పేర్కొన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్నారు. రాజకీయాల్లో ముందస్తు హామీలు ఉండవని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు జీవన్‌రెడ్డి సమాధానం చెప్పారు. జగిత్యాలలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలన్నారు. పసుపు, మొక్కజొన్న, కంది పంటలకు మద్దతు ధర కల్పించాలని, మొక్క జొన్న, పసుపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇసుక అందుబాటులో లేకపోవడం వల్ల నిర్మాణ రంగం కుంటుపడింద న్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక అందుబాటులో ఉంచిందని, జిల్లాలో అక్రమ ఇసుక దంపులపై కలెక్టర్ చొరవ చూపడండం అభినందనీ యమన్నారు. పసుపు బోర్డు ఏర్పాటుతో పసుపు పంటకు గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులు ఆశిస్తే మరింత ధర తగ్గడంతో ఆందోళన చెందుతు న్నారని జీవన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, కాంగ్రెస్ నాయకులు శీలం సురెందర్, కండ్లపెల్లి దుర్గయ్య తదతరులు పాల్గొన్నారు.

బద్దిపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


బద్ది పోచమ్మ ఆలయం వద్ద క్యూలో భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ అనుబంధ శ్రీబద్ది పోచమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. అమ్మవారికి భక్తులు ఉదయాన్నే మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పు చప్పుళ్లు, శివసత్తుల నృత్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తరలి వచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో మొక్కులు చెల్లించుకునేందుకు రావడంతో క్యూలైన్‌లో భక్తులు బారులు గంటల తరబడి నిరీక్షించారు. ఆలయంలోకి చేరుకున్న భక్తులు పట్నాలు వేసి నూతన వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించి అమ్మవారికి నైవేద్యంపెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఇన్‌చార్జి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివపార్వతుల కల్యాణం

కాల్వశ్రీరాంపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మల్యాల గ్రామంలోని విశ్వేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శివ పార్వతుల కల్యాణం ఆలయ అర్చకులు నిట్టూరి సతీష్‌శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి లెక్కల కవిత శ్రీనివాస్‌రెడ్డి, కామిడి పద్మశ్రీనివాస్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. శివాలయం కమిటీ అధ్యక్షుడు కాసర్ల మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు బసవత్తుల జ్ఞానేంద్ర చారి, కోశాధికారి ఉప్పుల రమేష్, కసార్ల సాగర్ రెడ్డి, సంజీవరెడ్డి, ఎర్రబాటి రవి, బూసి సదా శివరెడ్డి, కూనారం రమేష్, శీలం మల్లారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

ఇల్లందకుంట: మండలంలోని చిన్న కోమటిపల్లిలో వెలిసిన స్వయంభూ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీనర్సింహస్వామిని పట్టువస్త్రాలతో అలంకరించి హనుమాన్ దేవాలయంలో ఎదుర్కోళ్లను నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. ఆలయ అర్చకులు ప్రదీప్‌శర్మ, నవీన్‌శర్మల ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ చిట్ల చంద్రమౌళి దంపతులు, చుక్క అరుణ రాణి- రం జిత్‌కుమార్, చుక్క రజిత-వేణు గోపాల్ స్వామివారికి కల్యాణ పట్టు వస్త్రాన్ని సమర్పించారు. అనంతరం చుక్క అరుణ రాణి- రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చం ద్రమౌళి, వైస్‌చైర్మన్ రమేష్, కోశాధికారి వెంకటేశ్వర్లుపాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం

గంగాధర: మండలంలోని ఉప్పర మల్యాల తుమ్మెద గుట్ట లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు.

- గర్షకుర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం స్వామికి హవనం, బలిహరణం, బేరిపూజ నిర్వహించారు.

వైభవంగా నృసింహుడి కల్యాణం

తిలకించిన వేలాది మంది భక్తులు

పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి




ధర్మపురిలో శేషప్ప కళావేదికపై శ్రీ లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవం, తిలకిస్తున్న భక్తజనం

ధర్మపురి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నృసింహస్వామి కల్యాణం మంగళవారం సాయంత్రం గోధూళి సుమహూర్తమున అత్యంత వైభవంగా జరిగింది. భారీగా తరలి వచ్చిన వేలాది మంది భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం నరసింహ నామ స్మరణ చేస్తూ ఆలయానికి చేరుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే కల్యాణోత్సవం పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వరస్వామి వారల ఉత్సవమూర్తులను సాయంత్రం వేళలో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ఆలయాల నుంచి బయటకు తీసుకవచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన స్థానిక బ్రాహ్మణ సంఘం పక్కనే గల శ్రీ మఠం యాగశాల స్థలంలో ఏర్పాటు చేసిన నూతన కల్యాణ వేదికపైన ఆశీనులు చేశారు. యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవంలో అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, సంతోష్‌కుమార్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, రుత్వికులు సంకల్పం, ఆచమనం, యజ్ఞోప వీతాధారణ, కూడజీర ధారణ, బాసికం ధారణ, అక్షితారోహణం, కళ్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమచార్య నేతృత్వంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, అర్చకులు శాస్త్రోక్తంగా సనాతన సంప్రదాయ రీతిలో స్వామివారల కల్యాణోత్సవం జరిపించారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ధర్మపురి సీఐ రాం నర్సింహరెడ్డి, ఎస్‌ఐ ఉదయ్ కుమార్, పలువురు ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి, వేములవాడ ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, ఎస్పీ అశోక్‌కుమార్, ఈవో సంకటాల శ్రీనివాస్, జగిత్యాల ఫస్ట్ క్లాస్ అడిషనల్ మెజిస్ట్రేట్ నారాయణ, ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీవో రవీందర్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, జక్కు రవీందర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, వేములవాడ దేవస్థానం మాజీ ఈవో దూస రాజేశ్వర్, ఎండోమెంట్ డీఈఈ రఘునందన్ భక్తులు పాల్గొన్నారు.


కల్యాణంలో పాల్గొన్న జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ దంపతులు, ఎస్పీ అశోక్‌కుమార్, ప్రభుత్వ విప్, ధర్మపురి, వేములవాడ ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్

పట్టు వస్త్రాలు సమర్పించిన కలెక్టర్

ధర్మపురి : ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నృసింహ (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వర స్వామి వారల కల్యాణోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం పక్షాన జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు మంగళవారం సమర్పించారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాస్ కలెక్టర్ దంపతులకు స్వామి శేషవస్త్రాలు, ప్రసాదాలు బహూకరించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. మున్సిపల్ కమిష నర్ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, మేనేజర్ గంగాధర్, సిబ్బంది ఆలయానికి వెళ్లి స్వామివారలకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, పుస్తెలు, మట్టెలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్‌డీవో మదుసూధన్, డీపీవో మదన్‌మోహన్ ఉన్నారు.

భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి

ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. స్థానిక దేవాలయం వద్ద ఆయన కొద్ది సేపు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్షేత్రంలో పారిశుధ్య నిర్వహణ, వైద్య సౌకర్యం, వాహనాల పార్కింగ్, ఆర్‌టీసీ బస్సుల సౌకర్యం, పోలీస్‌శాఖ బందోబస్తు, ఇతరత్రా ఏర్పాట్లు సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో కొనసాగుతున్నట్లు వివరించారు.

ఘనంగా స్వామివారల ఎదుర్కోళ్లు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వర స్వామివారల ఎదుర్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చిలుకముక్క హరిప్రసాద్ ఇంటికి శ్రీ లక్ష్మీనరసింహ (యోగ,ఉగ్ర) స్వామి వారల ఉత్సవమూర్తులను తీసుకవచ్చారు. అలాగే ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు ఇంటికి శ్రీ వేంకటేశ్వర స్వామివారలను తీసుకవచ్చారు. ఉత్సవమూర్తులకు ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, సంతోష్ కుమార్, రాజగోపాల్ శాస్త్రోక్తంగా పూజలు జరిపి ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు.






స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల కలెక్టర్ దంపతులు, ధర్మపురి మున్సిపల్ పక్షాన పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకువస్తున్న కమిషనర్ దంపతులు

గ్రూప్-2లో 24వ ర్యాంకు సాధించిన రాకేష్



ఇల్లంతకుంట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి గ్రామానికి చెందిన గొట్టిపర్తి రాకేష్ గ్రూపు-2లో రాష్ట్రస్థాయిలో 24వ ర్యాంకు సాధించాడు. ఉస్మానియా యూనివర్సిటీల పీజీ చేసిన రాకేష్ నెలరోజుల క్రితమే ఎక్సైజ్‌శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా సిరిసిల్లలో విధులు నిర్వహిస్తున్నాడు.

34వ ర్యాంకు సాధించిన అఖిల్‌రెడ్డి



చందుర్తి: చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామానికి చెందిన ఎగుమామిడి సత్యనారాయణరెడ్డి -ఉమా దంపతుల కుమారుడు అఖిల్‌రెడ్డి గ్రూప్-2లో ఫలితాల్లో 34వ ర్యాంక్ సాధించాడు. అఖిల్‌రెడ్డిని మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు దూది శ్రీనివాసరెడ్డి, నాయకులు, గ్రామస్థులు అభినందించారు.

95వ ర్యాంకు సాధించిన ప్రశాంత్‌రెడ్డి



జమ్మికుంట రూరల్, ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన కాంతాల మల్లారెడ్డి- రజిత దంపతుల కుమారుడు సాయి ప్రశాంత్‌రెడ్డి గ్రూపు-2 ఫలితాల్లో స్టేట్ 95వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. ప్రశాంత్‌రెడ్డి గ్రూప్4లో ఉద్యోగం సాధించి రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డిని విస్‌డమ్ జూనియర్ కళాశాల, చాణిక్య డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యం, గ్రామస్థులు అభినందించారు.

ప్రతిభ చాటిన భువన



సిరిసిల్ల: సిరిసిల్లలోని అశోక్ నగర్‌కు చెందిన బుర్ర భువన గ్రూప్ పరీక్షల్లో ప్రతిభ చాటింది. సిరి సిల్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బుర్ర కృష్ణప్రసాద్ గౌడ్ కూతురు భువన సోమవారం ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో 456 మార్కులు సాధించగా మంగళవారం ప్రకటించిన గ్రూప్-2 ఫలితాల్లో 374 మార్కులతో రాష్ట్రవ్యాప్తంగా 363 ర్యాంక్ పొందారు. గ్రూప్-4లో ఉద్యోగం సాధించి కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ, గ్రూప్-1, గ్రూప్-2 లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచారు.

235 ర్యాంకు సాధించిన సంతోష్



గంభీరావుపేట: గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన మెతుకు సంతోష్ అనే యువకుడు గ్రూప్ 2లో 235 ర్యాంకు సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన మెతుకు సంతోష్ గతంలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. మంగళవారం వెలువడ్డ గ్రూప్ 2 పరీక్ష ఫలితాలు సంతోష్‌కు 380 మార్కులు రాగా, 235 ర్యాంకు వచ్చింది.

చక్కెర కర్మాగారాన్ని తెరిపించాలి

రైతులతో కలిసి బీజేపీ ధర్నా

మెట్‌పల్లిటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం ముత్యంపేట చక్కెర కర్మాగారాన్ని వెంటనే తెరిపించాలని మంగళవారం మెట్‌పల్లి పట్టణంలో బీజేపీ నాయకులు రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు డాక్టర్ రఘు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చక్కెర ఫ్యాక్టరీని మూతపడేలా చేసిందని విమర్శించారు. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నిర్లక్ష్యం కారణంగా దాదాపుగా పది వేల మంది కార్మిక, రైతుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కోసం నిజామాబాద్ ఎంపీ అర్వింద్ కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే పసుపు బోర్డు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. పసుపు రైతుల సంక్షేమానికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. చక్కెర ఫ్యాక్టరీ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరిబాబు, పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్, బీజేపీ నాయకులు ఏలేటి నరేందర్, చెట్లపల్లి సుఖేందర్ గౌడ్ పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, చెరుకు రైతులు

మద్దతు ధర చెల్లించాలి

పసుపు రైతుల మహాధర్నా

మెట్‌పల్లిటౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : పసుపు పంటకు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద మంగళవారం మహాధర్నా నిర్వహించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి శాస్త్రీ చౌరస్తా వరకు రైతులు ర్యాలీగా వచ్చి ధర్నా చేపట్టారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు, రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ పసుపు బోర్డు వచ్చిందని సంతోషపడాలో, పసుపు పంటకు మద్దతు ధర లేదని బాధపడాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నడూ లేని విధం గా పసుపు పంటకు కేవలం రూ.5 వేలు ధర ఉండటంతో పెట్టుబడి కూడా సరిపోవడం లేదన్నారు. రూ.15 వేలు మద్దతు ధర ప్రకటిం చాలని డిమాండ్ చేశారు. అలాగే మార్కెట్ ఇంటర్వేషన్ స్కీంలో పసుపును కలపాలని డిమాండ్ చేశారు. మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ చేరుకొని సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.


మెట్‌పల్లిలో రైతుల ధర్నా

అవీఇవీ..

గణేశ్‌నగర్:మండలంలోని మొగ్దుం పూర్‌లో 33/11కేవీ సబ్‌స్టేషన్ కార్యాలయం ఆవరణలో బుధవారం విద్యుత్ సరఫరా లోకల్ కోర్టు ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం ఛైర్మన్ వేణుగోపాలాచారి తెలిపారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేకోవాలని పేర్కొన్నారు.

కరీంనగర్ క్రైం: పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన గౌస్ ఆలంను మంగళవారం కార్యాలయంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సమద్ నవాబ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

భగత్‌నగర్: కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ మోడల్ స్కూల్, ఆరెపల్లి పాఠశాలలో మంగళవారం నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిర్వహించారు. సీడ్‌బాల్, వర్మికంపోస్టు తయారీపై వివరించారు.

కరీంనగర్ టౌన్: స్థానిక ఎస్ఆర్ డిజి స్కూల్‌లో డిజిటల్ పేమ్‌మెంట్స్ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు డిజిటల్ లావాదేవీలు, బ్యాంకు కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. టీజీబీ కరీంనగర్‌శాఖ చీఫ్ మేనేజర్ రవిశంకర్ తదితరులు హాజరయ్యారు.

కరీంనగర్ టౌన్: స్థానిక శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన 650 మంది విద్యార్థులు, ఆచార్యులకు పాఠశాల పూర్వ విద్యార్థి, కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ సహకారంతో శంభాజీ మహారాజ్ బలిదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం చావా చిత్రాన్ని చూపించారు. పాఠశాల ప్రధానాచార్యుడు రాజమౌళి, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, పాఠశాల అధ్యక్షుడు కరుణాకర్‌రావు పాల్గొన్నారు.

భగత్‌నగర్: మదర్సాల్లో పనిచేస్తున్న ఇమామ్‌లకు మజ్లీస్ తహఫ్ఫుజ్ ఖత్మే నబువ్వత్ ట్రస్టు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ మంగళవారం రంజాన్ కానుకలు అందజేశారు. హీరా ఫౌండేషన్ ద్వారా పంపిణీ చేశారు.

కరీంనగర్ టౌన్: జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న యువతకు భోజనవసతి అభినందనీయమని 9వ డివిజన్ మాజీ కార్పొరేటర్ జంగిలి ఐలేందర్‌యాదవ్ అన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌లో నిరుద్యోగ యువతకు గత ప్రభుత్వం భోజన వసతి కల్పించగా ప్రస్తుతం వారికి మధ్యాహ్న భోజనం ఇవ్వక పోవడంతో ఆకలితో అలమటించారని, విషయాన్ని లయన్స్ క్లబ్‌కు దృష్టికి తీసుకెళ్లగానే లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ వారు స్పందించి రెండు నెలల వరకు భోజనం కల్పిస్తామన్నారని తెలిపారు.

కరీంనగర్ రూరల్: నగరంలోని తీగలగుట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు హమ్ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు మునిగోపాల్ స్వప్న పెళ్లి రోజు సందర్భంగా మంగళవారం విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. వ్యవ స్థాపకుడు ధనపురి సాగర్, ప్రధానోపాధ్యాయుడు కరుణ ఉన్నారు.

మెస్ చార్జీల పెంపుతో విద్యార్థులకు పౌష్టికాహారం

- సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



విద్యార్థినులతో భోజనం చేస్తున్న సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచడంతో సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించగలుగుతున్నామని సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని మహాత్మా జ్యోతిబాపూలే బలహీన వర్గాల సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను పరిశీలించారు. విద్యార్థినులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మెస్ చార్జీలు పెంచిందని, దీంతో పౌష్టికాహారం అందించగలుగుతున్నామని అన్నారు. గతంలో ఇటువంటి పరిస్థితి ఉండేది కాదన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, కాంట్రాక్టర్ సరఫరా చేసే సరుకులు నాణ్యతతో ఉండేలా నిరంతర పర్యవేక్షించాలని సూచించారు. చిన్న చిన్న లోపాలు గుర్తించామని వాటిని సరిచేసుకోవాలని, ప్రభుత్వం నిర్ణయించిన మెనూను నాణ్యతతో అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్ మెండి చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు మిరాజ్, జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్, శ్రావణ్ నాయక్, కుర్ర పోచయ్య, పెద్దిగారి తిరుపతి, కొట్టె ప్రభాకర్, కీర్తి కుమార్, అష్రఫ్ ఖురేషి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో కాయకల్ప చికిత్స

(5వ పేజీ తరువాయి)

ఏఐసీసీ కార్యదర్శితో మాట్లాడి వచ్చిన వారిని తమ గురించి ఏమైనా ప్రశ్నించారా.. అసలు ఏమి అడిగారు. మీరేమి చెప్పారంటూ ఎంక్వయిరీ చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా మీనాక్షి నటరాజన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీశ్రేణుల్లో తమకు ఏదో జరుగబోతుందన్న నమ్మకం పెరిగింది. ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇప్పుడు మరో లెక్క. నేతల ఆటలు ఇక సాగవు అంటూ పార్టీ కేడర్ చర్చించుకుంటూ ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు.

● నామినేటెడ్ పోస్టులపై ప్రచారం

జిల్లాలో పలువురు సీనియర్ నేతలకు త్వరలోనే వివిధ నామినేటెడ్ పోస్టులు లభిస్తాయని ప్రచారం జరుగుతున్నది. ఈ విషయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఇప్పటికే జాబితాను సిద్ధం చేసుకున్నా ప్రస్తుత పరిస్థితుల నేపథ్యం లో వాటిలో పలు మార్పులు చోటుచేసుకుంటాయని తెలుస్తోంది. ఇప్పటి వరకు అవకాశాలు లభించని పలువురు సీనియర్లకు పదవులు దక్కబోతున్నాయంటూ ప్రచారం జరుగుతున్నది. మార్చి నెలాఖరువరకు నామినేటెడ్ పోస్టుల భర్తీ పూర్తి చేసి పార్టీ నేతలందరిని స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి సిద్ధం చేయాలని పార్టీ అధిష్టానం భావిస్తున్నట్లు చెబుతున్నారు.

ఆక్యుపంచర్ వైద్యంతో మెరుగైన ఫలితాలు

కరీంనగర్ లీగల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆక్యుపంచర్, ఆక్యూ ప్రెషర్ వైద్యం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చని, దీనిపై ప్రజల్లో అవగాహన అవసరమని జిల్లా జడ్జి బి.ప్రతిమ తెలిపారు. మంగళ వారం జిల్లా కోర్టు ఆవరణలో సంకల్ప ఆయుర్వేదిక్ అల్టర్‌నేటివ్ మెడిసన్ ఫిజియో థెరపీ ట్రీట్‌మెంట్ హైదరాబాద్ సౌజన్యంతో కరీంనగర్ బార్ అసోసియేషన్, న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో రెండు రోజుల ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. అనంతరం జిల్లా జడ్జి మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్‌కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి వెంకటేశ్ పాల్గొన్నారు.

మూడు రోజులు ఫ్లెక్సీ షాపులు బంద్

కరీంనగర్ టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఫ్లెక్సీ ప్రింటింగ్ చార్జీలకు ధర నిర్ణయించి అమలు చేసేందుకు బుధ, గురు, శుక్రవారం లోని నగరంలోని ఫెక్సీ ప్రిటింగ్ షాపులను బంద్ చేయాలని నిర్ణయించినట్లు కరీంనగర్ ఫ్లెక్సీ ప్రింటర్స్ అసోసియేషన్ ప్రకటించింది. అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులు పేర్కొన్నారు.

వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోస్టర్ ఆవిష్కరణ



వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోస్టర్ ఆవిష్కరణ

గణేశ్‌నగర్,మార్చి 11(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ 47లో భాగంగా కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ పోర్టల్ ద్వారా యూత్ పార్లమెంట్ పోస్టర్‌ను కలెక్టర్ పమేలా సత్పతి, వికసిత్ భారత్ మోడల్ జిల్లా చైర్మన్ ప్రొఫెసర్ రామకృష్ణ, నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ ఆఫీసర్ రాంబాబు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత వన్ ఎలక్షన్ వన్ నేషన్ అనే అంశంపై మైభారత్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని ఒక నిమిషం వీడియో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రోగ్రామ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన సీపీ



పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీ

కరీంనగర్ క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మంగళవారం జిల్లా కోర్టులోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి కార్యాలయంలో జిల్లా ప్రధానన్యాయమూర్తి బి. ప్రతిమను మర్యాద పూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్కను అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలపై చర్చించారు.

నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలిగా గీతారెడ్డి



కరీంనగర్ టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలిగా వావిలాలపల్లికి చెందిన సీనియర్ న్యాయవాది రూపిరెడ్డి గీతారెడ్డి నియామయ్యారు. మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో గవర్నమెంట్ ప్లీడర్‌గా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆమె ఎలక్ట్రిసిటీ బోర్డుకు స్టాండింగ్ కౌన్సిల్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం కలెక్టర్ పమేలాసత్పతిని మర్యాదపూర్వకంగా కలిశారు.

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా రమేశ్



కరీంనగర్ లీగల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది చామనపల్లి రమేశ్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియామకయ్యారు. ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. రామడుగు మండలం వెలిచాల చెందిన రమేశ్ 2004లో న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించారు. గవర్నమెంట్ ప్లీడర్‌గా నియామకంతో మూడేళ్లపాటు ప్రభుత్వం తరపున నమోదైన సివిల్ కేసులను వాదించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. నగరంలోని ఐబీ చౌరస్తా, సర్కస్ గ్రౌండ్, పాత డీఐజీ భవనం, సీఎస్ఐ చర్చి, కోర్టు సర్కిల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఎస్సారార్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

గణేశ్‌నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ కళాశాలలో మహిళా సాధికారత ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. అంతకుముందు అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ లో స్వర్ణ పతకాలు సాధించిన విరించి స్వప్నిక, సిరిచందనను, జాతీయ కారడిలో స్వర్ణ, రజత పతకాలు సాధించిన ఐశ్వర్యను అభినందించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ, కళాశాల మహిళా సాధికారత అధ్యక్షురాలు డాక్టర్ ఎం. అర్చన, డైటీషియన్ కాచం దీప్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌యూ రసాయన శాస్త్ర విభాగంలో వర్క్‌షాప్

గణేశ్‌నగర్,మార్చి 11 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాలలోని రసాయన శాస్త్ర విభాగంలో మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ మాట్లాడుతూ వర్క్‌షాప్‌లతో బోధన మెరుగుపడుతుం దన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్ మాట్లాడుతూ వర్క్‌షాప్‌తో నైపుణాలు పెంచుకోవచ్చన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయంతి అధ్యక్షతన నిర్వహించిన

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎమర్జెన్సీ రీస్టోర్ టీంలు

గణేశ్‌నగర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సర్కిల్ పరిధిలో యుద్ధప్రాతిపదికన విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎమర్జెన్సీ రీస్టోర్ టీంలు ఏర్పాటు చేసినట్లు సూపరింటెండింగ్ ఇంజనీర్ రమేష్ బాబు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, సాంకేతికంగా విద్యుత్ సమస్యలతో అంతరాయాన్ని తగ్గించడానికి బ్రేక్ డౌన్ టీంలను అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. 24/7 అందుబాటులో ఉంటరాని వివరించారు.

బీమా చెక్కు అందజేత

కరీంనగర్ అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ది గాయత్రీ కో-ఆపరేటివ్ అర్బన్‌బ్యాంక్ ఖాతాదారుడు కెమసారం తిరుపతి ఇటీవల ప్రమాదంలో మరణించగా గాయత్రీ నిర్భయ సేవింగ్ ఖాతా కింద లక్ష రూపాయల బీమా మంజూరైంది. ఈ సందర్భంగా మంగళవారం తిరుపతి భార్య కెమ్మసారం వెంకట లక్ష్మికి మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా గాయత్రి బ్యాంక్ కరీంనగర్ బ్రాంచి మేనేజర్ గొట్టె అశోక్ మాట్లాడుతూ రైతులకు 10.50 శాతం చొప్పున వ్యవసాయ రుణాలను అందిస్తున్నామన్నారు. సీనియర్ ఆఫీసర్ విష్ణుధర్, జూనియర్ ఆఫీసర్ ఉల్లెంగుల అనీల్ పాల్గొన్నారు.

బాలికల అప్పగింత

కరీంనగర్ క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన నలుగురు బాలికలు ఈ నెల 9న అదృశ్యమయ్యారు. ఈ మేరకు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీని కనుగొన్న కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు మంగళవారం వారిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగిం చారు. బాలికల వద్ద సెల్‌ఫోన్‌లు, డబ్బులు లేకున్నా ఉచిత బస్సుద్వారా గుంటూరుకు వెళ్లారు. సీసీ కెమెరాలు, సాంకేతికతతో ఆ నలుగురు బాలికలను గుర్తించి కరీంనగర్ తీసుకొవచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి

సుభాష్‌నగర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ చేసిన డాక్టర్ ప్రసన్నహరికృష్ణ కోరారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మానవ వనరులు అభివృద్ధి చెందాలంటే విద్యా, వైద్యం, ఉపాధిరంగాలకు అధిక నిధులు కేటాయించాలన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే ఎజెండాగా రాష్ట్రాన్ని సాధించుకున్నామని, పదేళ్లుగా విద్యారంగానికి చాలీచాలని నిధులు కేటాయించడం శోచనీయమన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరిం చాలన్నారు. మానవ వనరుల పెంపులో విద్యవైద్యం, పాత్ర ఎనలేనిదన్నారు. కాంగ్రెస్ మెనిఫెస్టోలో పొందు పరిచిన విధంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

పద్మశాలీలకు సీఎం క్షమాపణ చెప్పాలి



మగ్గాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేస్తున్న నాయకులు

గణేశ్‌నగర్,మార్చి 11(ఆంధ్రజ్యోతి): పద్మశాలీలకు సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకుడు అడిచర్ల రాజు డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ చౌరస్తా వద్ద చేనేత మగ్గాన్ని పసుపు నీళ్లతో శుద్ధిచేసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లో అఖిలభారత పద్మశాలి సంఘం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహాసభలో సీఎం రేవంత్ రెడ్డి చేనేత మగ్గంపై కాళ్లకు షూ వేసుకొని కూర్చోవడం పద్మశాలీల మనోభావాలను దెబ్బ తీసిందని అన్నారు. కరీంనగర్ పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి వంగర ఆంజ నేయులు, కోశాధికారి గజవెల్లి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య

హుజూరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణ ప్రజలు ఎల్ఆర్ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య సూచించారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో లైసెన్స్, టెక్నికల్ పర్సన్స్, సర్వేయర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్-2020లో ప్లాట్లు కొనుగోలు చేసి దరఖాస్తులు చేసుకున్న వారికి మార్చి 31 లోగా చెల్లిస్తే 25శాతం రాయితీ కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో మేనేజర్ భూపాల్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అశ్వినిగాంధీ, నలుబాల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాణంలో విద్య కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సమ సమాజ నిర్మాణంలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్న సందర్భంగా చొప్పదండి మైనారిటీ బాలికల స్కూల్ గంగాధరలో అభినందన సభను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ నేషనల్‌సాయిలో విద్యనందించడానికి ఇంటి గ్రేటెడ్ స్కూళ్లను ప్రారంభిస్తుందన్నారు. కార్యక్రమంలో మైనారిటీ రీజనల్ లెవల్ కోఆర్డినేటర్ సురేష్, కురిక్యాల సింగిల్ విండో అధ్యక్షుడు వెలిచాల తిరుమల్‌రావు, మైనారిటీ గురుకుల ప్రిన్సిపాల్ వారుణి పాల్గొన్నారు.

స్టాక్ నిల్వలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

శంకరపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పెస్టిసైడ్ షాపు నిర్వాహకులు ప్రతినెల విధిగా స్టాక్ నిల్వలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మానకొండూర్ ఏడీఏ శ్రీధర్ అన్నారు. మంగళవారం కేశవపట్నం రైతు వేదికలో ఏవో వెంకటేష్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రైవేట్, పీఏసీఎస్ పెస్టిసైడ్ డీలర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఏఈవోలు పెస్టిసైడ్ షాపు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు పెంపు

శంకరపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మోడల్ స్కూల్ 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశ పరీక్ష, ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు పెంచినట్లు కేశవపట్నం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేశవపట్నం మోడల్ స్కూల్ 6వ తరగతిలో 100 సీట్లు, 7నుంచి 10వ తరగతిలో మిగిలిన సీట్ల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులకు మార్చి 20, ప్రవేశ పరీక్షకు ఏప్రిల్ 20 తేదీకి పొడగించినట్లు పేర్కొన్నారు. అర్హత గల విద్యార్థులు మార్చి 20లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న గంగాడి కృష్ణారెడ్డి

వీణవంక మార్చి11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని మాల్లారెడ్డిపల్లి, చల్లూరు, కోర్కల్, ఇప్పపల్లి గ్రామాల్లో కృష్ణారెడ్డి పర్యటించారు. వీణవంకలో రోడ్డు విస్తరణ పనులు పరిశీలించారు. మాల్లారెడ్డిపల్లిలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఈజీఎస్ నిధులతోనే పనులు చేపడుతూ తామే చేసినట్టుగా రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని మండిపడ్డారు. వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక పాలన పూర్తిగా పడేకిసిందని ఆరోపించారు. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభత్వం హామీలను విస్మరించిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బత్తిని నరేష్‌గౌడ్, నాయకులు రామిడి ఆదిరెడ్డి, పెద్ది మల్లారెడ్డి, చెన్నమాధవుని నర్సింహరాజు, ఎనగంటి శ్రీనివాస్, తిరుమల్, మడ్డురి సమ్మిరెడ్డి, కర్రె నాని, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, వినోద్, అనిల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు అవాస్తవం'

మానకొండూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాల ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల ఎంపికలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ డబ్బులు డిమాండ్ చేశాడని కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలు అవాస్తవమని మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ అన్నారు. మానకొండూర్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల పదవీ కాలం ముగియడంతో రాష్ట్రప్రభుత్వం ఆరు నెలల పదవీ కాలాన్ని పొడిగించినప్పటికి బీఆర్ఎస్‌కు చెందిన ఛైర్మన్లు ఉన్న సంఘాలను ప్రత్యేకాధికారులను నియమించడం సరైంది కాదన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులే ఊటూర్‌లోని ఇసుక, మట్టి తరలింపు విషయంలో ధర్నా చేయడంలో అంతర్యం ఏమిటో మండల ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శాతరాజు యాదగిరి, దండబోయిన శేఖర్, పున్నం మల్లయ్య, నెల్లి మురళీ ఉన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి



రాజేశ్వరిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ శక్తి సూపర్ షీ కో-ఆర్డినేటర్ రాజేశ్వరి అన్నారు. డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం మానకొండూర్‌లో రాజేశ్వరిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాలు, గ్రామాల్లో కాంగ్రెస్ శక్తి సూపర్ షీ కో-ఆర్డినేటర్ కమిటీలు వేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి, రాష్ట్ర శక్తి సూపర్ షీ కో-ఆర్డినేటర్ విద్యారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

లోవోల్టేజితో కాలిపోయిన మోటార్లు

రామడుగు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లోవోల్టేజితో మండలంలోని వెదిర గ్రామంలోని వ్యవసాయ మోటార్లు కాలిపోయాయి. గ్రామ రైతులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం పలుమార్లు విద్యుత్తులో అంతరాయం ఏర్పడి విద్యుత్ హెచ్చుతగ్గుల కారణంగా మోటార్లు దెబ్బతిన్నాయన్నారు. గ్రామానికి చెందిన సుమారు పది మంది రైతులకు చెందిన వ్యవసాయ మోటార్లు దెబ్బతిన్నాయి. అసలే పంటలు ఎండిపోయే దశలో ఉండగా, వాటిని కాపాడుకోవడానికి రైతులు అగచాట్లు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

హాకీ పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలి

హుజూరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16 నుంచి హుజూరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ హాకీ క్రీడలను సమర్థవం తంగా నిర్వహించాలని హాకీ అసోసి యేషన్ జిల్లా కార్యదర్శి సర్దార్ సు రేందర్‌సింగ్ అన్నారు. హుజూరాబాద్ హైస్కూల్ మైదానంలో నిర్వ హించబోయే రాష్ట్రస్థాయి హాకీ క్రీడల ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం సురేందర్ సింగ్ మాట్లాడుతూ హాకీ అంటే హుజూరాబాద్.. హుజూరాబాద్ అంటే హాకీ అన్న పేరు వచ్చిందన్నారు. హుజూరాబాద్ ప్రాంతంలోని క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి లో అనేక పథకాలు సాధించారన్నా రు. ఈ నెల 16,17,18వ తేదీల్లో జరిగే హాకీ పోటీల క్రీడాకారులకు అన్ని వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో హాకీ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, హాకీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, హాకీ క్లబ్ సభ్యులు శంకర్, ఉమామహేశ్వర్, సీనియర్ క్రీడాకారులు సమ్మయ్య, శ్రీనివాస్, తిరుపతి, వినయ్, రోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి రూ. 200కోట్లు

తిమ్మాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ నియోజకవర్గనికి సంబంధించి తిమ్మాపూర్ మండలంలో గల యాదవులపల్లిలో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 200 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, అకామిక్ బ్లాక్, స్టాఫ్ క్వార్టర్లు, లైబ్రరీ, క్రీడా ప్రాంగణం, బాలురు, బాలికల హాస్టల్ బ్లాకుల నిర్మించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు నాణ్యమైన విద్యను అందించేందుకు నడుం బిగించిందని తెలిపారు.

రూ.7,150 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7150 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 19 మంది రైతులు 290 క్వింటాళ్ల విడిపత్తి, నలుగురు రైతులు 15క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర 7150 రూపాయలు, కనిష్ఠ ధర ఐదు వేల రూపాయలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

సంక్షిప్త సమాచారం..

సైదాపూర్: మండలంలోని లస్మన్నపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులను ఎంపీపీఎస్ ఉపాధ్యాయులు అర్చన, మేఘన ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెన్నంపల్లి హెచ్ఎం ప్రభాకర్‌రెడ్డి, పాఠశాల చైర్‌పర్సన్ మౌనిక, రమేష్ పాల్గొన్నారు.

జమ్మికుంట: జమ్మికుంట పట్టణంతో పాటు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు ఆధ్వర్యంలో 250 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం, వైస్ చైర్మన్ ఎర్రం సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

హుజూరాబాద్ రూరల్: మండలంలోని కాట్రపల్లి గ్రామ అధ్యక్షుడిగా కోమటి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మండలాధ్యక్షుడు కొల్లూరి కిరణ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

ఇల్లందకుంట మండలంలోని చిన్నకోమటిపల్లి గ్రామంలో స్వయంభూ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో గ్రామానికి చెందిన చుక్క అరుణరాణి-రంజిత్ దంపతులు రూ. 30లక్షలతో నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను మంగళవారం ప్రారంభించారు.

సుభాష్‌నగర్: ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు ఉద్యోగ నోటిఫికేషన్ పరీక్షల ఫలితాలను నిలిపివే యాలని వర్తింపచేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట నిరవధిక నిరాహార దీక్ష కొనసాగుతోంది. దీక్షలో కొమురయ్య, అంజయ్య, శంకర్, బాబు, లక్ష్మణ్, మల్లేశం పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండల కేంద్రంలో గల అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ మహనీయుల విగ్రహాల ముసుగును తొలగించి ఆవిష్కరణకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి కోరారు.